అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు



నోటీసులపై మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న గాజులరామారంవాసులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి, మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తామని, కొంతమంది అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని, వారు పద్ధతి మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా పలువురికి నోటీసులు ఇవ్వగా స్థానికులు శ్రీశైలంగౌడ్‌ను కలిసి తమకు వచ్చిన నోటీసులపై మాట్లాడారు. ఇదే విషయంపై అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఆయన.. నోటీసులు జారీ చేసిన తర్వాత వారికి ఏ విషయంపై నోటీసు ఇచ్చారు.. అన్న క్లారిటీ ఇవ్వకుండా ఇలా బెదిరింపు ధోరణిలో నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అసెంబ్లీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక అధికారులు ఫిర్యాదులు రాగానే స్పందించాలని కోరారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, అందులో భాగంగానే గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.10 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు గుర్తు చేశారు.

అభివృద్ధి పనులపై ఆరా



కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో పర్యటిస్తున్న కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

కుత్బుల్లాపూర్: ఇంజినీరింగ్ అధికారులు రూపొందించిన పలు అభివృద్ధి పనుల విషయంపై ఆరా తీసేందుకు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చవాన్ పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీగణేష్, ఉప కమిషనర్ నరసింహతో పాటు పలు విభాగాల అధికారులతో కలిసి రంగారెడ్డినగర్, సుభాష్‌నగర్, జీడిమెట్ల డివిజన్ పరిధిలోని సుమిత్రనగర్, ఆదర్శనగర్, మహానగర్, వెంకటేశ్వరనగర్, ఏపీ హెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. మొత్తం సర్కిల్–25 పరిధిలో సుమారు రూ.3 కోట్లకుపైగా 9 పనులను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయితే వాటికి నిధులు మంజూరు చేసే విషయంలో క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉన్నది అన్న విషయంపై ఆరా తీసేందుకు అపూర్వ చౌహాన్ పర్యటించడం విశేషం. ప్రతి కాలనీలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. డీఈ పాపమ్మ, ఏఈ సురేందర్ నాయక్, హార్టికల్చర్ విభాగం అధికారి రఘువీరారెడ్డి, వైద్య ఆరోగ్య అధికారి భార్గవ్ నారాయణ తదితరులు వెంట ఉన్నారు.

బోనాల ఉత్సవాలకు ఆహ్వానం



మేయర్ నీలారెడ్డిని ఆహ్వానిస్తూ..

నిజాంపేట్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తోందని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బాచుపల్లి ఎస్సీ కాలనీలోని శ్రీపోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ నెల 11న జరిగే బోనాల ఉత్సవాలకు రావాలని కోరుతూ మేయర్‌కు ఆహ్వాన పత్రిక అందజేయగా ఆమె సానుకూలంగా స్పందించారు.

బాచుపల్లి డీఐగా తిమ్మప్ప



నిజాంపేట్: బాచుపల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా గురువారం తిమ్మప్ప బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి చేపట్టిన బదిలీల్లో భాగంగా తిమ్మప్పను బాచుపల్లికి కేటాయించారు. ఇప్పటి వరకు బాచుపల్లికి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో తిమ్మప్ప మొదటి డీఐగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సీఐ, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అధికారుల బదిలీల ప్రక్రియ పూర్తి



కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయం

చింతల్: ప్రభుత్వ అధికారులు బదిలీల్లో భాగంగా నాలుగు సంవత్సరాల పాటు ఒకే చోట పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి బదిలీ కావాలన్న ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో అధికారుల బదిలీల ప్రక్రియ పూర్తయ్యింది. షాపూర్‌నగర్ సబ్ డివిజన్–2 డీజీఎంగా పనిచేస్తున్న అప్పలనాయుడు అలియాబాద్ డివిజన్–2బి సబ్ డివిజన్–1కి బదిలీ అయ్యారు. డివిజన్–9 కూకట్‌పల్లి సబ్‌డివిజన్–2 డీజీఎంగా పనిచేస్తున్న డి.రవి షాపూర్‌నగర్‌కు బదిలీ అయ్యారు. కుత్బుల్లాపూర్ డివిజన్ 12 ఎస్ఆర్‌డబ్ల్యూ అధికారిగా పనిచేస్తున్న విష్ణుప్రసాద్ అదనంగా సబ్ డివిజన్–3 జగద్గిరిగుట్ట డీజీఎం విధులు నిర్వర్తిస్తుండగా బదిలీల్లో భాగంగా ఎస్ఆర్‌డబ్ల్యూకే పరిమితం కాగా జగద్గిరిగుట్ట సబ్ డివిజన్–3 డీజీఎంగా డివిజన్–3 సబ్ డివిజన్–2 డీజీఎంగా పనిచేస్తున్న జె.వికాస్ జగద్గిరిగుట్టకు వచ్చారు. సూరారం, జీడిమెట్ల సెక్షన్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అనూష సూరారం ప్రాంతానికే పరిమితం కాగా ఓల్డ్ సిటీ నుంచి ఈశ్వరయ్య జీడిమెట్ల సెక్షన్ మేనేజర్‌గా నియమితులయ్యారు. భగత్‌సింగ్ నగర్, ఆదర్శనగర్ సెక్షన్లకు మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పూజిత భగత్‌సింగ్ నగర్‌కు పరిమితం కాగా డివిజన్–9 నుంచి యాదయ్య డీబీ సెక్షన్, ఆదర్శనగర్‌కు సెక్షన్ మేనేజర్‌గా నియమితులయ్యారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఈ అధికారులు పూర్తిస్థాయిలో విధుల్లో చేరారు. కాగా జగద్గిరిగుట్ట సెక్షన్ మేనేజర్ స్థానం ఏడాది కాలంగా ఖాళీగా ఉండగా ఉషోదయ సెక్షన్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఝాన్సీ జగద్గిరిగుట్టకు అదనపు విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా డివిజన్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు భాగంగా సీనియర్ ఆఫీసర్ విజయ రాధిక, సత్యనారాయణ, రాములు, లాలప్ప తదితరులు జలమండలి ప్రధాన కార్యాలయానికి వెళ్లగా, కుత్బుల్లాపూర్ రెవెన్యూ, హెచ్ఎంఆర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రామచందర్ కూకట్‌పల్లి డివిజన్ 9కి బదిలీపై వెళ్లారు. కాగా కిందిస్థాయి సిబ్బంది బదిలీల ప్రక్రియపై నీలినీడలు కమ్ముకున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ మహిళా నాయకుల నిరసన



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మహిళలు

మహిళలకు గౌరవం ఇదేనా?

- అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలను అవమానిస్తారా
- సీఎం, డిప్యూటీ సీఎంకు ఇంత అహంకారమా..
- పలుచోట్ల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



బాచుపల్లి సాయినగర్‌లో నిరసన తెలుపుతూ..

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన అహంకారపూరిత మాటలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు గురువారం పెద్దఎత్తున చేపట్టారు. కుత్బుల్లాపూర్, నిజాంపేట్, బాచుపల్లి, కొంపల్లి, దుండిగల్ తదితర ప్రాంతాల్లో బీఆర్ఎస్ మహిళా నాయకులు సీఎం, డిప్యూటీ సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు. అసెంబ్లీలో మహిళా ప్రజాప్రతినిధుల పట్ల సీఎం చులకనగా మాట్లాడారని, ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవమని ప్రశ్నించారు. సీఎం క్షమాపణలు చెప్పకుండా రాష్ట్రంలో ఎక్కడా తిరగనీయమని హెచ్చరించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్ 'త్రి మంకీస్ సెంటర్' అమరవీరుల స్తూపం వద్ద ఎన్ఎంసీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు



దుండిగల్ పీఎస్‌ను సందర్శిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

దుండిగల్: దుండిగల్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో కేసుల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించిన ఆయన వాటి పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్యూటీలో సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, విధుల విషయంలో ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు. ఆయన వెంట ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, దుండిగల్ సీఐ సతీష్ ఉన్నారు.

కళాశాలల సమీపంలో బస్టాప్ ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలల సమీపంలో బస్టాప్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ బహదూర్‌పల్లి చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జి.కార్తిక్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులను కాలేజీకి దూరంగా ఆపడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తరచూ క్లాసులు మిస్‌కావడంతో చదువుల్లో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. పలువురు విద్యార్థులు ఫుట్ బోర్డింగ్ చేస్తూ బస్సుదిగే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. జీడిమెట్ల డిపో ఆర్టీసీ అధికారులు కళాశాల వద్ద బస్టాప్‌ను ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో డిపో ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. మండల నాయకులు భగత్, అజయ్, రాజేష్, లడ్డూ పాల్గొన్నారు.



బహదూర్‌పల్లి చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన

మాదిగల 30 ఏళ్ల కల సాకారం

- ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటం
- దళిత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ విజయభాస్కరరావు



మాట్లాడుతున్న బూదాల విజయభాస్కరరావు

కుత్బుల్లాపూర్: మాదిగల 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటమైన ఎస్సీ వర్గీకరణ కల సుప్రీం కోర్టు తీర్పుతో సాకారమైందని దళిత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ బూదాల విజయభాస్కరరావు అన్నారు. కుత్బుల్లాపూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1994లో మంద కృష్ణమాదిగ నాయకత్వంలో మాదిగల వెనుకబాటుతనాన్ని గుర్తించి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రారంభించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 59 ఎస్సీ కులాలను ఏబీసీడీ వర్గీకరణ చేస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారన్న ఆశయంతో ఉద్యమం చేపట్టడం జరిగిందన్నారు. 2000 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏబీసీడీలుగా వర్గీకరణ చేయడంతో 2004 వరకు 24వేల మంది మాదిగ ఉపకులాలకు చెందిన వారు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని, వర్గీకరణపై 2004లో కొందరు సుప్రీం కోర్టుకు వెళ్లడంతో అప్పటి నుంచి వర్గీకరణ నిలిచిపోయిందన్నారు. ఏడుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం జస్టిస్ డీజీ చంద్రచూడ్ నాయకత్వంలో ఏబీసీడీ వర్గీకరణ సమంజసమే అని తీర్పు ఇవ్వడం శుభపరిణామమని, సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ తెలంగాణలో 12 శాతం ఉన్న మాదిగలకు సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ చేపట్టి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో గట్టు అశోక్, ఆర్.సిద్దయ్య, మేకలు ఎల్లయ్య, కొమ్ము యాదగిరి, అంజన్న, యాదమ్మ, రాణి, స్వరూప, మహేష్, ఆర్.కృష్ణ, రాజు, అనిల్, బాలస్వామి, కృపవరం తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలు.. లక్ష్మీదేవి ప్రతిరూపాలు



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సన్న కవిత

కుత్బుల్లాపూర్: అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరించిన తీరు ఆయన అహంకారానికి నిదర్శనమని మాజీ ఎంపీపీ సన్న కవిత అన్నారు. రాష్ట్ర శాసన సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతరెడ్డిలను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను గురువారం కొంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో ఆడబిడ్డలను లక్ష్మీదేవి ప్రతిరూపాలుగా చూస్తారని, అలాంటిది శాసనసభ వేదికగా వారిని కించపరిచేలా సీఎం వ్యవహరించారని ఆరోపించారు. సీఎం తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని రాష్ట్ర మహిళలకు క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు కృష్ణవేణి, శిరీష, కో ఆప్షన్ సభ్యురాలు మంగమ్మ పాల్గొన్నారు.

4న ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఈ నెల 4న ఉచిత బీపీ, షుగర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సుందరయ్య భవన్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 9 గంటల వరకు జరిగే శిబిరంలో వైద్య పరీక్షలతో పాటు అనుభవజ్ఞులైన వైద్యులు సలహాలు ఇస్తారన్నారు. రూ.100కే నెలకు సరిపడా మందులను అందిస్తామని, ఇతర వివరాలకు ఫోన్: 93485 81024 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సారూ.. ఫిర్యాదు చేసినా పట్టదా..?



విద్యుత్ వైర్లకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని మర్రి నారాయణరెడ్డి నగర్ కాశీవిశ్వేశ్వరుడి ఆలయం సమీపంలో విద్యుత్ స్తంభానికి చెట్ల కొమ్మలు అడ్డురావడంతో నిత్యం కరెంటు ట్రిప్ అవుతోందని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. వర్షం, ఈదురుగాలుల కారణంగా గంటల తరబడి రోడ్ నంబర్–7లో సమస్య ఉత్పన్నమవుతోందని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి విద్యుత్ అధికారులకు విన్నవించారు. గతంలో ఇదే సమస్యపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాం



సౌభాగ్యనగర్‌లో విద్యుత్ సమస్యలు వింటున్న బోయిన్‌పల్లి డీఈ భిక్షపతి

రంగారెడ్డినగర్: విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని బోయిన్‌పల్లి విద్యుత్ డివిజన్ డీఈ భిక్షపతి అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సౌభాగ్యనగర్, ఆదర్శనగర్‌లలో విద్యుత్ సమస్యలపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను విన్న డీఈ భిక్షపతి వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఏడీఈ కేవల్‌కుమార్, ఏఈ శంకరయ్య, ఆదర్శనగర్ ప్రెసిడెంట్ శంకరయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ జయరామ్, రవీందర్‌గుప్తా, రామకృష్ణ, కనకరావు తదితరులు ఉన్నారు.

వెట్టిచాకిరి నుంచి బాలకార్మికులకు విముక్తి



వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందిన బాలలతో అధికారులు

కుత్బుల్లాపూర్: వెట్టిచాకిరి చేస్తున్న బాల కార్మికులను గురువారం మేడ్చల్ జోన్ స్పెషల్‌టీమ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహకారంతో బాలసంరక్షణ కేంద్రాలకు తరలించారు. డీసీపీ ఉమెన్ సేఫ్టీ వింగ్ సుజానా, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, స్పెషల్‌టీమ్ అధికారి వెంకటగిరి, పేట్‌బషీరాబాద్ ఇన్‌చార్జి ఎస్ఐ పరశురామ్ ఆధ్వర్యంలో పలు అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, చౌరస్తాల్లో భిక్షాటన చేయిస్తుండగా ఏకకాలంలో దాడులు నిర్వహించి మైనర్లను రక్షించారు. మేడ్చల్ డివిజన్ పరిధిలో 50 కేసులు, పేట్‌బషీరాబాద్ డివిజన్ పరిధిలో 46 కేసులు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. బాలలను సంరక్షణ కేంద్రానికి తరలించి వారికి విద్యను అందించే ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

ఈ విజయం అమరవీరులకు అంకితం

- ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం
- ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, దళిత సంఘాల సంబురాలు



కుత్బుల్లాపూర్ అంబేడ్కర్ చౌరస్తాలో సంబురాల్లో ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు

కుత్బుల్లాపూర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో సిలువేరు శ్రీనివాస్ మాదిగ, రసమల్ల యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విజయం అమరవీరులకు అంకితమన్నారు. 2004లో ఐదుగురు జడ్జిల ధర్మాసనం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కొట్టివేసినా, 2024లో ఏడుగురు జడ్జీల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు సంతోషమని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెస్ఎఫ్ జాతీయ నాయకులు తోకల చిరంజీవి మాదిగ, ఇసురం రమేష్, సంఘీ మహేష్, గడ్డం కురుమయ్య, మట్ట నర్సింహులు, దళిత సంఘాల నాయకులు రామడుగు సిద్దయ్య, భూదాల విజయభాస్కర్‌రావు, యాదయ్య, మహిళా నాయకురాలు సలోమీ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు

◆ సూరారం చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ జాతీయ కళా మండలి అధ్యక్షుడు అశోక్ మాదిగ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చేసిన పోరాటం ఫలించిందని, ఎస్సీ వర్గీకరణలో మాదిగ ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మేకల నగేష్ మాదిగ, మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల బాబు, జిల్లా కన్వీనర్ వెంకట్ మాదిగ, డప్పు రామస్వామి, మహేశ్వరి, ఎస్తేరు రాణి, తలారి చైతన్య, వేముల జానయ్య, మహేష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు



సూరారం చౌరస్తాలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కట్ట మైసమ్మ ఆలయ 6వ వార్షికోత్సవం



పూజల్లో ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్ రెడ్డి, శైలజ దంపతులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్ కట్ట మైసమ్మ ఆలయ 6వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు రవిశర్మ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు గురు ప్రస్థాన, గణపతి పూజ, అఖండ దీపస్థాపన, దీక్ష ధారణ, ధ్వజరోహణం తదితర పూజలను గురువారం నిర్వహించి మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి అగ్ని ప్రతిష్ఠ, లక్ష్మీ గణపతి పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్‌రెడ్డి, శైలజ దంపతులు పూజల్లో పాల్గొనగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజులపాటు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వివేక్ రెడ్డి తెలిపారు.

వివాహం కావడం లేదని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు విష్ణుప్రసాద్

కుత్బుల్లాపూర్: వివాహం కావడం లేదన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి మున్సిపల్ గాంధీనగర్‌కు చెందిన విష్ణుప్రసాద్(35) ఎలక్ట్రీషియన్. ఇతను తన తల్లితో కలిసి నివాసముంటున్నాడు. వయసు పెరుగుతున్నా వివాహం కాకపోవడంతో కొన్ని రోజులుగా మనస్తాపానికి గురవుతూ వస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల 31వ తేదీన ఉదయం 8 గంటలకు అతడి తల్లి పనిపై బయటకు వెళ్లగా విష్ణుప్రసాద్ ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల ట్రాఫిక్ అవేర్‌నైస్..



ట్రాఫిక్ అవేర్‌నెస్ కల్పిస్తున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ అవేర్‌నెస్ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ కె.వెంకట్ రెడ్డి అన్నారు. సుచిత్ర చౌరస్తాలో శివశివాని డిగ్రీ కాలేజీ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరుతూ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌పై ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులు విద్యార్థులను అభినందించారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను విద్యార్థి దశ నుంచే చేపట్టడం శుభ పరిణామం అని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ప్రమాదాలను ఈ కార్యక్రమం ఎంతో మందికి అవగాహన కలిగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అల్వాల్ ఎస్‌హెచ్‌ఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం

ఆల్విన్‌కాలనీ: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మాదిగ యూత్ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు చిరుమర్తి రాజు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సంవత్సరాల సుదీర్ఘ సమస్యకు నేడు పరిష్కారం లభించిందన్నారు. ఎన్నో త్యాగాలకు గౌరవం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు.